# పంచవర్ష ప్రణాళికలు... సంస్కరణలు.. ఆర్థిక ప్రగతి!!

**స్వాతంత్ర్యానంతరం భారత్‌లో ఆర్థిక ప్రగతికి ప్రణాళికలు ఎంతో దోహదపడ్డాయి. అయితే, పేదరిక నిర్మూలనలో ప్రణాళికల పాత్రపై ఆర్థికవేత్తల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. 1990-91లో దేశంలో ఆర్థిక సంక్షోభ పరిస్థితి తలెత్తింది. నాడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పలు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టింది. తద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు నూతన దిశను ఇచ్చింది. అది ప్రస్తుత ఆర్థిక సంక్షోభ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడకుండా చూడటంలో దోహదపడింది. మరోవైపు విత్త ప్యాకేజీల ద్వారా ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో ఉద్దీపన చర్యలు చేపడుతోంది. తాజాగా అసోచామ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం- జీ-20 దేశాల్లో... భారత్ నాల్గవ అతి శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా రూపొందింది!!**

1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. భారత ప్రభుత్వం 1950లో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేసింది. ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి ప్రధాన ఉద్దేశంగా ప్రణాళికా సంఘం ఏర్పాటు అయింది. శీఘ్రగతిన ఆర్థికాభివృద్ధి సాధించడం.. స్వయంసమృద్ధి.. పేదరిక నిర్మూలన.. మానవాభివృద్ధి.. ప్రాంతీయ అసమానతల తొలగింపు.. ఆదాయ అసమానతలు తగ్గించడం.. సాంఘిక న్యాయ సాధన... భారత ప్రణాళికల ప్రధాన లక్ష్యాలు. ఈ లక్ష్యాల సాధనలో ఎంతవరకు సఫలీకృతమయ్యామనే విషయంలో ఆర్థికవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. 1993-94లో భారత్‌లో పేద ప్రజల సంఖ్య.. 320 మిలియన్లు. 2004-05లో ఆ సంఖ్య 300 మిలియన్లు. ప్రణాళికలపరంగా పేదరిక నిర్మూలనకు తీసుకున్న చర్యలు.. దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజల సంఖ్యను తగ్గించడంలో సఫలం కాలేకపోయాయన్నది కొంతమంది ఆర్థికవేత్తల అభిప్రాయం. ప్రణాళికాపరంగా వ్యవసాయంపై ప్రభుత్వ పెట్టుబడులు తగ్గడం ఆ రంగం కుంటుపడడానికి కారణమైంది. 9వ ప్రణాళికలో 2.1 శాతం.. పదో ప్రణాళికలో 2.3 శాతం వృద్ధిని వ్యవసాయరంగం నమోదు చేసుకుంది. వ్యవసాయ విధానంలో... 4 శాతం వ్యవసాయరంగ వృద్ధిని లక్ష్యంగా నిర్ణయించినా ఆ మేరకు వృద్ధి సాధించలేకపోయాం. 1990లలో తక్కువ వృద్ధికి అనుపాతంగా.. తక్కువ ఉపాధి వృద్ధి చోటు చేసుకుంది. ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి లక్ష్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమల స్థాపనను ప్రభుత్వం ప్రోత్సహించింది. అవి ఆధునికీకరణకు నోచుకోలేదు. దాంతో ప్రపంచీకరణ యుగంలో పోటీ పరిస్థితిని తట్టుకోలేక అధికశాతం ఖాయిలాపడ్డాయి. పారిశ్రామికరంగ ప్రగతిలో కీలకమైన తయారీరంగం వృద్ధిలోనూ ఒడిదుడుకులు ఎదురయ్యాయి.

## 1990-91 సంక్షోభం:

1990-91లో విదేశీ చెల్లింపుల శేషంలో లోటు తీవ్రమైంది. వినిమయ రేటులో సర్దుబాటు సరిపడే విధంగా లేకపోవడం సంక్షోభానికి దారితీసింది. 1989 మధ్య నుంచి 1991 మధ్యవరకూ చోటుచేసుకున్న రాజకీయపరమైన అంశాలు కూడా సంక్షోభ తీవ్రతకు కారణమని చెప్పొచ్చు. సోవియట్ యూనియన్

విచ్ఛిన్నం కావడం.. కువైట్‌ను ఇరాక్ ఆక్రమించడం వల్ల చమురు సంక్షోభం తీవ్రమైంది. 1990-91లో వాణిజ్యం క్షీణించి... కరెంట్ అకౌంట్ లోటు పెరగడానికి ఈ విదేశీ అంశాలు కూడా దోహదం చేశాయి. 1980లలో భారతదేశం మొత్తం వాణిజ్యంలో.. సోవియట్ బ్లాక్‌లో జరిగిన రూపాయి వాణిజ్యం ప్రధానమైంది. 1980లో భారత మొత్తం ఎగుమతుల్లో.. తూర్పు ఐరోపా వాటా 22.1 శాతం. కాగా 1989లో అది 19.3 శాతం. తూర్పు ఐరోపా దేశాలు విడిపోవడం వల్ల 1990-91లో రూపాయి చెల్లింపు ఒప్పందాలు అనేకం క్షీణించాయి. తూర్పుఐరోపాలో, యూఎస్ ఎస్ఆర్‌లలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో రూపాయి వాణిజ్య క్రెడిట్ ప్రవాహం తగ్గింది. ఆయా మార్కెట్లకు ఎగుమతులు పెంచుకోవడానికీ అవరోధాలు ఏర్పడ్డాయి. 1970లతో పోల్చినపుడు 1980లలో మన దేశంలో అధిక వృద్ధి నమోదు అయింది. అదే సమయంలో ద్రవ్యలోటు, కరెంట్ అకౌంట్ లోటు, విదేశీ రుణం పెరగడం కూడా సంభవించింది. 1990-91లో విదేశీ చెల్లింపుల శేషంలో లోటు పెరిగి... 'మూల్య నీకరణ' అవసరం తలెత్తింది. సమష్టి డిమాండ్ పెరుగుదల.. ద్రవ్యలోటుపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు.. జీడీపీలో 7.8 శాతంగా ఉండటం.. చెల్లింపుల శేషంలో సంక్షోభం తీవ్రం కావడం.. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్త స్థితిని తెలుపుతుంది. 1980లలో దిగుమతుల వృద్ధి.. జీడీపీలో 2.3 శాతం. కాగా ఎగుమతుల వృద్ధి.. జీడీపీలో 0.3 శాతం మాత్రమే.

### సంస్కరణలు:

1991, జూలైలో కొత్త ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాన్ని తెరపైకి తెచ్చింది. స్థూల ఆర్థిక అసమతౌల్యాన్ని తొలగించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. చెల్లింపుల శేషంలో సంక్షోభాన్ని అధిగమించాలంటే.. అన్నిరకాల నియంత్రణలు తొలగించాలని.. తద్వారా మార్కెట్ పోటీలో క్రమశిక్షణ పెంపొందించాలని భావించింది. చాలా దేశాల్లో చెల్లింపుల శేషంలో సంక్షోభ నివారణకు అమలుచేసిన సాంప్రదాయ స్థూల ఆర్థిక నమూనా ప్రైవేటు పెట్టుబడులు.. వృద్ధి తగ్గుదలకు దారి తీయడాన్ని అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ గుర్తించారు. అంత క్రితం రెండు దశాబ్దాల కాలంలో తూర్పు, దక్షిణ ఆసియాలోని కొన్నిదేశాలు పేదరిక నిర్మూలన, అధిక వృద్ధి సాధనలో సాధించిన విజయాలు ఆయన్ను అమితంగా ఆకర్షించాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో సరళీకరణ.. దేశంలోకి మూలధన ప్రవాహంలో ఎలాంటి నియంత్రణలు లేకుంటే.. చెల్లింపుల శేషం లోటు సమస్యను అధిగమించవచ్చనే అభిప్రాయానికి మన్మోహన్ వచ్చారు. ఈ నేపథ్యంలో పారిశ్రామిక, బ్యాంకింగ్, మూలధన మార్కెట్, బీమా రంగం, విదేశీ మారకద్రవ్యం.. తదితర రంగాలకు సంబంధించి పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు.

### ప్రపంచీకరణ:

1990లలో భారత ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అధిక వృద్ధిసాధించడం ద్వారా... పోటీతత్వాన్ని పెంపొందించడానికి సంస్కరణలు ప్రవేశపెట్టారు. మూల్యనీకరణ..

ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ.. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి.. ఎన్ఆర్ఐ డిపాజిట్ల ఆకర్షణకు చర్యలు చేపట్టారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నమూనా భారత్‌లో అధిక వృద్ధికి తోడ్పడింది. దేశంలో విదేశీమారక ద్రవ్య నిల్వలు పెరిగాయి. ప్రపంచంలో 'మార్కెట్ క్యాపిటలైజేషన్'లో భారత్ నాల్గవ స్థానం పొందింది. భూమిలేని వ్యవసాయ కుటుంబాల సంఖ్య పెరిగింది. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి.

## అసోచామ్ నివేదిక:

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక సంక్షోభ కాలంలో... జీ-20 దేశాల్లో భారత్ నాల్గో అతి శక్తివంతమైన దేశంగా ఆవిర్భవించిందని అసోచామ్ (ASSOCHAM) తాజా నివేదిక అభిప్రాయపడింది. చైనా, రష్యా, దక్షిణ కొరియా తర్వాతి స్థానం భారత్‌దే. సమృద్ధిగా విదేశీమారక ద్రవ్య నిల్వలు.. తలసరి జీడీపీ వృద్ధి రేటు అధికంగా ఉండటం.. అభిలషణీయమైన ద్రవ్య విధానాలు అవలంబించడం తదితర కారణాల వల్ల ఈ దేశాలు పటిష్ట స్థితిలో ఉన్నాయని సదరు నివేదిక అభిప్రాయపడింది.

అసోచామ్ ఏడు కొలమానాల ఆధారంగా... జీ-20 దేశాల ఆర్థిక ప్రగతిని అంచనా వేసింది.
అవి..

1. ఆర్థిక వ్యవస్థ పరిమాణం (Size of the economy)
2. వ్యయం చేయగల శక్తి (Spending power)
3. పన్ను నిర్మాణత (Tax structure)
4. వడ్డీరేటు విధానం (Interest Rate Policy)
5. బడ్జెట్ బ్యాలెన్స్ (Budget balance)
6. రుణ భారం (Debt burden)
7. విదేశీమారక నిల్వలు (Foreign Exchange Reserve)

పై సూచీల ఆధారంగా... అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, బ్రిటన్, జపాన్.. వరుసగా 11, 12, 13వ స్థానాల్ని పొందాయి. అసోచామ్ నివేదిక ప్రకారం-అమెరికా కంటే.. చైనాలో విదేశీమారక ద్రవ్యనిల్వలు అధికం. కాగా, వ్యయం చేయగల శక్తి (Spending Power)లో అమెరికా కంటే రష్యా ముందంజలో ఉంది. మిగతా దేశాల కంటే.. దక్షిణ కొరియా ముందంజలో ఉండటానికి... పన్నుల నియంత్రణ, విత్త సంస్థలు పెట్టుబడి కోడ్‌ను సక్రమంగా అమలుచేయడమే కారణం.

''ఈ ఆర్థిక సంవత్సరంలో చైనా వృద్ధి రేటు తగ్గే అవకాశముంది. దీన్ని భారత్ తనకనుకూలంగా మలచుకోవాలి.

ప్రపంచ మార్కెట్‌లో తన స్థాయిని పెంచుకోవాలి''

– సురేష్ టెండూల్కర్.

**ఆర్థికవేత్తల అభిప్రాయాలు:**

ప్రస్తుతం వినియోగ డిమాండ్ పెంచడమే ప్రపంచవ్యాప్తంగా విధాన నిర్ణేతల ప్రాధాన్యత అంశంగా మారింది. తమ ఆర్థిక వ్యవస్థలను తిరోగమనం నుంచి వృద్ధి దిశగా పయనింపచేయడానికి అనేక దేశాలు ఇప్పటికే విత్త ప్యాకేజీ (fiscal stimulus) ప్రకటించాయి. ''రష్యా ఆర్థిక వృద్ధికి చమురు, మైనింగ్ రంగాలు దోహదపడ్డాయి. భారత్ ప్రస్తుత తిరోగమనం నుంచి ఆర్థిక వృద్ధి దిశగా పయనించాలంటే.. ప్రభుత్వం స్వదేశీ రంగాల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలి. పన్ను, వడ్డీ రేట్ల తగ్గింపు వినియోగదారుల్లో విశ్వాసాన్ని పెంచి.. మార్కెట్ వద్ధికి దోహ దపడుతుంది'' అని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాల యానికి చెందిన ఆర్థికశాస్త్ర అధ్యాపకులు డి.ఎన్.రావ్ అభిప్రాయపడ్డారు. 'భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే.. దేశంలో ద్రవ్యోల్బణం నిర్వహణ చాలా కీలకమైంది'– అని 'ఫిక్కీ' సభ్యుడు అంజన్‌రాయ్ పేర్కొన్నారు. ''భారతదేశంలో 2009– 10లో సేవల రంగం మంచి పురోగతి సాధించగలదు. ఆహారధాన్యాల ఉత్పత్తి కూడా ప్రస్తుతం సంతృప్తికరంగా ఉంది. ఈ స్థితి భారత ఆర్థిక వ్యవస్థకు రానున్న రోజుల్లో మంచి వృద్ధి రేటు సాధించడానికి దోహదపడగలదు''అని సురేష్‌టెండూల్కర్ అభిప్రాయపడ్డారు.''భారత్‌కు పటిష్టమైన పునాది ఉంది. స్వదేశీ డిమాండ్ పెరుగుదల.. విదేశీ మార్కెట్లపై తక్కువగా ఆధారపడటం.. భారత్‌ను ప్రపంచంలో మిగతా ఆర్థిక వ్యవస్థలకు పోటీగా తయారు చేయగలదు. రెండోవిత్త ప్యాకేజీని అందించడం ద్వారా దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెంచడానికి ప్రభుత్వ కృషి చేయడం అభినందనీయం'' అని సౌమెన్ ఛటర్జీ పేర్కొన్నారు!!

SAKSHI

SAKSHI